క్లుప్తంగా

రైతులను దగా చేస్తే ఊరుకోం..



మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దారు ఎం.శ్రీను సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మిల్లర్లతో సోమవారం సమావేశమైన ఆయన.. తేమశాతం పేరుతో రైతులను దగా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దళారీల ద్వారా ధాన్యం మిల్లులకు చేరినట్లు తెలిసినా కూడా చర్యలు తప్పవన్నారు. అలాగే తరుగు పేరుతో రైతుల దగ్గర నుంచి 4 కేజీలు అదనంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇంకోసారి అలా చేసినట్లు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్ఐ రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

రాజాం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల సత్తా



పతకాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారని పీడీ చీకటి కేశవనారాయణ సోమవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీన విజయవాడలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అండర్-19 విభాగంలో ఈ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో కళాశాలకు చెందిన బి.దీక్షిత(47 కేజీల విభాగంలో), జి.చరణ్‌రామ్‌సాయి(66 కేజీల విభాగంలో) ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారన్నారు. సదరు విద్యార్థుల ప్రతిభను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్ర తదితరులు అభినందించారు.

దుస్తుల వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణదాసు మాస్టారు

బొబ్బిలిరూరల్: క్రిస్మస్ పండగ నేపథ్యంలో మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం స్కూల్ ఉపాధ్యాయుడు అలజంగి కృష్ణదాసు మాస్టారు గ్రామంలోని పలువురు నిరుపేద క్రైస్తవులకు సోమవారం దుస్తులు వితరణ చేశారు. అలాగే పవిత్ర ధనుర్మాసం సందర్భంగా గ్రామస్తులకు సహపంక్తి భోజనాలు పెట్టారు. వీటితో పాటు జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకుని, రైతులను సత్కరించి, తనకు తోచిన సాయం చేశారు. ఆయన ఇలా తన నెల జీతంలో 10 శాతాన్ని ఇలా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతే దేశానికి వెన్నెముక



రాజాం సిటీ: రైతులను సన్మానిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: రైతే దేశానికి వెన్నెముక అని, రైతు కష్టాన్ని ప్రతిఒక్కరూ గ్రహించి గౌరవించాలని ప్రిన్సిపాల్ ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక చైతన్య పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకుని, పలువురు రైతులను సత్కరించారు. ప్రభుత్వాలు కూడా రైతులకు సాయం చేయాలని ఆయన కోరారు.

బొబ్బిలి: పట్టణంలోని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో జాతీయ రైతు దినోత్సవం సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు రైతులను ఆశ్రమ నిర్వాహకులు ఆహ్వానించి, సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జి రాజేశ్వరి అక్కయ్య, జగన్నాథపురం ఎంపీటీసీ తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎనీ టైమ్ మూతే..

- రాజాంలో పనిచేయని ఏటీఎంలు
- పట్టించుకోని బ్యాంకర్లు
- అవస్థలు పడుతున్న ఖాతాదారులు



చీపురుపల్లి రోడ్డులో పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం

రాజాం: పారిశ్రామికంగా అభివృద్ధి చెందే రాజాం పట్టణాన్ని ఏటీఎం(ఆటోమేటిక్ టెల్లర్ మెషీన్)ల సమస్య వెంటాడుతోంది. మండల కేంద్రంలో 27కు పైగా పలు బ్యాంకుల ఏటీఎంలు ఉండగా, వాటిలో సగానికి పైగా పనిచేయడం లేదు. వీటికి తోడు కొన్ని నిరుపయోగంగా, మరికొన్ని అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. దీంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ఏటీఎం పెట్టడంలో హడావిడి కనబరిచిన బ్యాంకులు వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సకాలంలో నగదు తీసుకోవాలంటే చాలా ఏటీఎంలు మారాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా బ్యాంకర్లు స్పందించి, ఏటీఎంలు బాగు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఏడాదిగా పనిచేయడం లేదు..

రాజాం ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి కార్యాలయం వద్ద ఏటీఎం సెంటర్ దగ్గర ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అక్కడ మాత్రమే సెక్యూరిటీ గార్డుల హడావిడి ఎక్కువగా కనిపిస్తుంది. ఏటీఎం వద్దకు వెళ్లే వారికి పలు నిబంధనలు చెబుతుంటారు. ఇదే బ్రాంచికి చెందిన మరో ఐదు ఏటీఎం సెంటర్ల వద్ద ఒక్క సెక్యూరిటీ గార్డును కూడా ఉంచలేదు. ఇదిలా ఉంటే బొబ్బిలి రోడ్డులోని ఇదే బ్రాంచి ఏటీఎం గత ఏడాది కాలంగా పనిచేయడం లేదు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడి ఏటీఎం కేంద్రాన్ని శునకాలు ఆవాసంగా చేసుకున్నాయి. పాలకొండ రోడ్డులో సైతం ఇదే బ్రాంచికి చెందిన ఓ ఏటీఎం సెంటర్ ముందు తలుపులు పూర్తిగా పోయాయి. ఇక్కడి ఏటీఎం..కు అంతగా రక్షణ లేకపోవడంతో స్థానిక బ్రాంచి అధికారులు, మనీ లోడింగ్ అధికారులు కానరాకపోవడం విశేషం.

నగదు ఉండడం లేదు..

కెనరా, బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, సెంట్రల్ కార్పొరేషన్ బ్యాంకులకు చెందిన ఏటీఎంలు కూడా పలుచోట్ల మొరాయిస్తున్నాయి. వీటిలో నగదు నిల్వలు కూడా అంతగా ఉండడం లేదని ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ఏటీఎంల ద్వారా డబ్బులు తీసుకోవాలంటే నరకం చూస్తున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం క్రిస్మస్, సంక్రాంతి, కొత్త సంవత్సరం వంటి పండగలు వస్తుండడంతో ఏటీఎంలు అవసరమైనందున వీలైనంత త్వరగా పాడైన ఏటీఎంలను వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పాలకొండ రోడ్డులో తలుపులు ఊడిపోయి అస్తవ్యస్తంగా కనిపిస్తున్న మరో ఏటీఎం

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



రాజాం పట్టణంలోని ఏటీఎంలు ఒక్కోసారి సరిగా పనిచేయవు. నాలుగైదు ఏటీఎంల వద్దకు వెళ్తే గానీ డబ్బులు తీసుకోలేని దుస్థితి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఏటీఎం కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండడం లేదు. ఏ ఏటీఎం చూసినా పాడైపోయినట్లు కనిపిస్తోంది. చాలా ఏటీఎంలు కనిపిస్తున్నా వాటిలో కొన్నింట్లోనే నగదు ఉంటోంది.

– ఎం.వాసుదేవరావు, రామారాయపురం, సంతకవిటి మండలం

అపరిశుభ్రంగా ఉంటున్నాయి..



రాజాంలోని చాలా ఏటీఎంలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. కొన్ని మెషీన్లు అయితే ఎప్పుడూ సర్వర్ డౌన్ అని చూపిస్తుంటాయి. అత్యవసర సమయాల్లో డబ్బుల కోసం అవస్థలు పడుతున్నాం. ప్రధాన బ్యాంకుల ఏటీఎంలలో కూడా ఒక్కోసారి నగదు ఉండని పరిస్థితి ఉంటోంది.

–గొర్లె నారాయణరావు, రాజాం

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి



రాజాం: గార్రాజుచీపురుపల్లి మ్యాపు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

తెర్లాం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని మండల సర్వేయరు సాయి, తహసీల్దారు కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి కోరారు. మండలంలోని నెమలాం, ఆర్.గదబవలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు సోమవారం నిర్వహించారు. ఆయా సదస్సులకు హాజరైన రైతుల నుంచి భూ సమస్యలపై అధికారులు అర్జీలు స్వీకరించారు. తమ దృష్టికి వచ్చిన రైతు సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సిద్ధం చేయండి..

రాజాం: మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వమిత్వా సర్వేకు రికార్డులు సిద్ధం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి, బొమ్మినాయుడువలస, రాజయ్యపేట, కంచరాం తదితర గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను సోమవారం సందర్శించిన ఆయన.. ఆయా గ్రామాల్లోని నివాసాలు, ప్రభుత్వ స్థలాలు, జిరాయితీ భూములు, గ్రామ కంఠాలు, పటాలు(మ్యాపులు)ను పరిశీలించాలని, సర్వే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని కొండవలస, కోడిశ గ్రామాల్లో తహసీల్దారు ఎం.చిన్నారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు సోమవారం నిర్వహించి, రైతు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కొంతమంది రైతుల భూముల 1-బిలు ఆన్‌లైన్‌లో రాకపోవడాన్ని అధికారులు దృష్టికి రైతులు తీసుకువచ్చారు.

వినతిపత్రం అందజేత



ఎంఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

బొబ్బిలిరూరల్: మండలంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ సంఘ నాయకులు కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో లక్ష్మణరావును యూటీఎఫ్ ప్రతినిధులు, ఆ పాఠశాల ఉపాధ్యాయులంతా సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి నియోజకవర్గంలోని 14 క్లస్టర్లలో ఇదే పెద్ద స్కూల్ కాంప్లెక్స్ అని, పాఠశాల సముదాయాల పునర్వ్యవస్థీకరణలో స్కూల్ కాంప్లెక్స్ నుంచి పాఠశాలను తొలగించడం అన్యాయమన్నారు. తక్షణమే ఆ స్కూల్ కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. ధనుర్మాసోత్సవంలో చేసే పూజల ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

వంగర: విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ విద్యార్థులకు సూచించారు. జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకుని సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్ష పోటీల్లో పోటీల్లో వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బొడ్రోతు ప్రతాప్ పదో ర్యాంకు సాధించాడు. ఈ మేరకు సదరు విద్యార్థికి మెమొంటో, ప్రశంసాపత్రం అందించి విద్యార్థిని అభినందించారు.

నీటమునిగిన పంటల పరిశీలన

రాజాం:

తుపాను వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలను ఏవో రేణుకాసాయి, వీఏఏలు సోమవారం పరిశీలించారు. కంచరాం, బొద్దాం, పెనుబాక తదితర గ్రామాల్లో పర్యటించిన వారు.. అపరాల పంటలతో పాటు మొక్కజొన్న పంట సంరక్షణకు తక్షణమే సస్యరక్షణ చర్యలు ప్రారంభించాలని సూచించారు. వీఏఏల ద్వారా పంటలు బాగా నష్టపోయిన ప్రాంతాల వివరాలు సేకరిస్తున్నామన్నారు.

రాజాం సిటీ: అపరాల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని శాస్త్రవేత్త లక్ష్మణరావు సూచించారు. మండలంలోని గుయ్యానవలస గ్రామంలో తుపాను వర్షాలకు పాడైన పెసర పంటను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలో మొలకలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పంటపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడంతో పాటు ముందస్తుగా ఎకరాకు 15 కిలోల యూరియా చల్లాలని తెలిపారు. ఇలా ముందస్తు జాగ్రత్తలతో పంటలో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు.

సంతకవిటి: తుపాను వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పాడైన పంటలను ఏవో పైల నవీన్ పరిశీలించి, పంటను కాపాడుకునేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించి, పంటకు అదనపు బూస్టర్‌గా ఎకరా పంటకు 10 కిలోల యూరియా, మరో 10 కిలోల పొటాష్ పిచికారీ చేయాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో నీటమునిగిన పంటలను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమయ్యారు. వర్షపునీరు చేరడంతో పాడయ్యే దశలోని మినప, పెసర పంటలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేసి, రక్షించుకునే యత్నం చేస్తున్నారు. పూత దశలోని అపరాల పంటలకు ఇలా ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేయడం, పొలాల్లోని నీటిని బయటకు తరలించడం వంటివి చేస్తే పంటను కాపాడుకోవచ్చన్నారు.



రాజాం సిటీ: గుయ్యానవలసలో పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మణరావు, ఏవో రేణుకాసాయి



పెనుబాకలో పంటనష్టం అంచనా వేసే పనిలో నిమగ్నమైన వీఏఏ



సంతకవిటి: చిత్తారపురంలో పంటలు పరిశీలిస్తున్న ఏవో నవీన్



రేగిడి: వన్నలిలో నీటమునిగిన మినప పంటపై ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న రైతు

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి



ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం పునరాలోచన చేయాలని దళిత సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వంగర బస్టాండ్ ఆవరణలో దళిత సంఘాల నాయకులు నల్లరిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని, నిరసన తెలిపారు. క్రీమీలేయర్ ముసుగులో రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రగా తాము భావిస్తున్నామని, ఇది దళితుల ఐక్యతను దెబ్బతీయడమేనన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాల పరిధిలో ఎస్సీ వర్గీకరణ అంశం ఉంచరాదని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎం.గణపతి, ఎం.గణపతిరావు, కె.రామారావు, సీహెచ్ గంగులు, వై.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. – వంగర

నేలకొరిగిన మొక్కజొన్న



తుపాను వర్షాలకు పలు పంటలు దెబ్బతిన్నాయి. గత మూడు రోజులుగా కురిసిన వానలకు బాడంగి మండలంలోని కోడూరుకు చెందిన నలుగురు రైతుల ఎకరన్నర భూ విస్తీర్ణంలోని మొక్కజొన్న పూర్తిగా నేలకొరిగింది. దీంతో పాటు పలుచోట్ల మినప, పెసర, నువ్వు పంటలు పాడయ్యాయి. ప్రస్తుతం పంటలు బతికున్నా ఎండలు కాసేటప్పటికి పూర్తిగా చనిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు వాపోతున్నారు. – బాడంగి

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



బొబ్బిలిలోని సీబీఎం చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మతబోధకులు చదివి వినిపించిన క్రీస్తు సందేశం.. మతవిశ్వాసకులను ఆలోచింపజేసింది. మంచి మార్గం వైపు నడిచేలా చేసింది. ప్రధానంగా ఏసు ప్రభువు జన్మవృత్తాంతం తెలిపే నాటిక ప్రదర్శన ఆద్యంతం అలరించింది. – బొబ్బిలి

మంచి కార్యకర్తను కోల్పోయాం..



సత్యం మృతదేహంపై పూలు చల్లి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: గేదెల సత్యం అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని, ఓ మంచి కార్యకర్తను కోల్పోయామని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పీడిక రాజన్నదొర అన్నారు. విజయనగరం జిల్లా ఆస్పత్రిలో ఆదివారం రాత్రి సత్యం మరణించగా, విషయం తెలుసుకున్న రాజన్నదొర.. సత్యం స్వగ్రామమైన జయతికి సోమవారం వెళ్లి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ తర్వాత తనపై సత్యం చూపిన అభిమానాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు దుర్గ, ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ కనిమెరక త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, తమ ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుని, సరదాగా గడిపారు. అనంతరం అప్పటి తమ గణిత ఉపాధ్యాయులు అమనాన చక్రపాణి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సూచనలను పరిగణనలోకి తీసుకునేందుకు మంగళవారం 'డయల్ యువర్ సీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం జె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.